సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



రాజన్న జలప్రసాదం

వేములవాడ: రాజన్న భక్తులకు స్వచ్ఛమైన జలం అందించేందుకు రాజన్న జలప్రసాదం పేరుతో ఆలయ ఆవరణలో ఆరుచోట్ల ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు.



'డబుల్' ఇళ్లకు భూమి పూజ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బాలమల్లుపల్లె పరిధిలోని ఎడ్లవానికుంటలో శుక్రవారం డబుల్ ఇళ్ల నిర్మాణాలకు సర్పంచ్ కస్తూరి లత, ఎంపీటీసీ రాము భూమిపూజ చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0/16.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పనులు నాణ్యతతో చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న డీఈవో

బోయినపల్లి(చొప్పదండి): మన ఊరు–మన బడి పనులను నాణ్యతతో చేపట్టాలని డీఈవో రాధాకిషన్ ఆదేశించారు. బోయినపల్లి హైస్కూల్, ప్రైమరీ స్కూళ్లలో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం ఈ పథకం కింద నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, హైస్కూల్, పీఎస్ హెచ్‌ఎంలు ఎం.ప్రేమలత, జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు గోళికంటి శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

భక్తుడికి అస్వస్థత



భక్తుడిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తుడు శుక్రవారం అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన ఆలయ సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. భక్తుడు పోలంపల్లికి చెందిన సురేశ్‌గా ఆలయ అధికారులు తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

సిరిసిల్లఅర్బన్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ సునందిని పేర్కొన్నారు. సర్దాపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. చిరుధాన్యాల సాగు విధానం– ఆహారం లో వాటి ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సుప్రజ, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి అన్ని ఏర్పాట్లు



డిప్యూటీ ఆర్‌ఎం, డీఎంలకు రాజన్న ప్రసాదం అందిస్తున్న సిబ్బంది

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామని డిప్యూటీ ఆర్‌ఎం భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. వేములవాడ ఆర్టీసీ డిపో ఆఫీస్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాతర ప్రత్యేకంగా వివిధ డిపోల నుంచి 850 ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయం వరకు జాతరకు మూడు రోజులు ఉచిత బస్సులు నడిపిస్తామని తెలిపారు. వేములవాడ డిపోలో డీఎంగా పనిచేసి పదోన్నతిపై ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు డిప్యూటీ ఆర్‌ఎమ్‌గా వెళ్తున్న భీమ్‌రెడ్డిని, నూతనంగా వేములవాడ డిపో మేనేజర్‌గా బాధ్యతలు తీసుకున్న మురళీకృష్ణకు ఆర్టీసీ సిబ్బంది రాజన్న ప్రసాదం అందజేశారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు

సిరిసిల్లటౌన్: దివ్యాంగులైన ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తు గడువు మార్చి 31 వరకు పొడగించినట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమాధికారి లక్ష్మీరాజం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ నివాసులై, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, దివ్యాంగుల వర్గానికి చెందిన వారు స్కాలర్‌షిప్‌లకు అర్హులుగా పేర్కొన్నారు.వివరాలకు htttp//telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను 94900 91770లో సంప్రదించవచ్చని తెలిపారు.

కరెంట్ కష్టాలు !

వేళాపాల లేని విద్యుత్ సరఫరాతో తిప్పలు



బాపుసాయిపేటలో కరెంట్ మోటారు వద్ద నిద్రిస్తున్న ఈ రైతు పేరు కర్నాల రాములు. ఇతనికి రెండెకరాల పొలం ఉంది. ఇటీవల నాటు వేశాడు. పొలం ముదురుకలుపు తీశాడు. కరెంట్ కోతలతో పొలం తడారిపోతుందని రాత్రి వచ్చే కరెంట్ కోసం పొలం వద్దనే చలిలో నిండా ముసుగేసి పడుకున్నాడు. త్రీఫేజ్ కరెంట్ వస్తే.. సమీప రైతులు కేకలు వేస్తే.. నిద్ర నుంచి లేచి మోటారు పెట్టేందుకు ఇలా నిద్రపోతున్నాడు.



తడారిపోయిన ఈ వరి పొలం తంగళ్లపల్లి మండల కేంద్రంలోనిది. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంట్ ఇస్తున్నామని పాలకుల మాటలు నమ్మి రైతులు వరిపంటు సాగు చేశారు. ఇప్పుడు 12 గంటల సరఫరాతో ఇలా పొలం తడారిపోతుంది. 12 గంటల కరెంట్ కూడా వేళాపాల లేకుండా వస్తుండడంతో రైతులు యాసంగిపై ఆశలు వదులుకున్నారు.



చలిమంట కాగుతున్న ఈ ముగ్గురు యువరైతులది రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట. వీరికి ఊరికి రెండున్నర కిలోమీటర్ల దూరంలోని బండ కింద, మూలవాగు ఒడ్డున పొలాలు ఉన్నాయి. బుధవారం రాత్రి 11 గంటలకు త్రీఫేజ్ కరెంట్ వస్తుందని నిద్రపోకుండా కరెంట్ మోటారు వద్దకు వచ్చి నిరీక్షించారు. కానీ కరెంట్ ఎంతకూ రాకపోవడంతో చలికి వణుకుతూ.. మంట వేసుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు త్రీఫేజ్ కరెంట్ రావడంతో మోటార్లు పెట్టారు. సగం పొలం పారకముందే తెల్లవారుజామున 5 గంటలకు కరెంట్ పోయింది.

- తడారుతున్న వరి పొలాలు
- పొలాల వద్దే నిద్రిస్తున్న రైతులు
- 12 గంటల విద్యుత్ సరఫరాతో ఇబ్బందులు

జిల్లాలో యాసంగి స్వరూపం

గ్రామాలు	255
వరిసాగు	1,66,661 ఎకరాలు
కరెంట్ మోటార్లు	73,735

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) విద్యుత్ పంపిణీ చేస్తుంది. 24 గంటల కరెంట్‌ను కాస్త ఈ యాసంగి సీజన్‌లో 12 గంటలకు కుదించారు. ఇచ్చే ఆ 12 గంటల కరెంట్ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, రాత్రి 9.30 నుంచి తెల్లవారుజామున 4.30 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్‌ను మొన్నటి వరకు సరఫరా చేశారు. గత వారం రోజులుగా వేళాపాల లేకుండా త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేస్తున్నారు. గత ఐదారు రోజులుగా రాత్రి 11 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు సరఫరా చేశారు. పగటిపూట కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాలకు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఒక్కరే ఉండడంతో రాజన్నసిరిసిల్ల జిల్లాకు విద్యుత్ సరఫరాలో కోత విధిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో వరిపొలాలు ఎండిపోతున్నాయి. రైతులు తమ శ్రమఫలాన్ని కాపాడుకునేందుకు రాత్రి వేళల్లో ప్రమాదాలను సైతం లెక్క చేయకుండా.. వణికించే చలిలో పొలాల వద్దనే కునుకుతీస్తూ కరెంట్ కోసం కాపాలా ఉంటున్నారు.

టైం ప్రకారం ఇవ్వడం లేదు..



నేను నాలుగు ఎకరాలు నాటువేసిన. కరెంట్ టైం ప్రకారం ఇవ్వడం లేదు. రాత్రి పూట మోటార్ల దగ్గరే నిద్రపోకుండా కరెంట్ కోసం కావలి ఉంటున్నారు. పొలాలు ఎండిపోతున్నాయి. ఒక్కసారి ఎండిపోతే.. ఇక పొలం పారదు. ఆ ఇచ్చే కరెంట్ టైమ్ ప్రకారం ఇస్తే మంచిగుంటది.

– పంబాల భూమయ్య, బావుసాయిపేట

గిప్పడే గిట్లయితే ఎట్లా..



నాకు మూడెకరాల పొలం ఉంది. మొన్నటి దాకా బాగానే ఇచ్చిండ్రు. కానీ పది రోజుల నుంచి కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలియదు. గిప్పడే గిట్లయితే రేపు ఎండా కాలంలో త్రీఫేజ్ కరెంట్ ఎట్లనో ఏమో. పొలాలు పారక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– గొల్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, బావుసాయిపేట

గ్రిడ్‌లో సమస్యలు ఉన్నాయి



కొద్దిరోజులుగా విద్యుత్ పంపిణీ గ్రిడ్‌లో సమస్యలు ఉన్నాయి. రెండు రోజులుగా మరీ కరెంట్ సమస్యలు తీవ్రమయ్యాయి. డిస్కమ్, ఎన్పీడీసీఎల్ అధికారులతో మాట్లాడుతున్నాం. సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా నిర్ధిష్ట వేళల్లో కరెంట్ సరఫరా చేస్తాం.

– చిక్కాల రామారావు, 'సెస్' చైర్మన్, సిరిసిల్ల

ఆరోగ్యంగా ఉంటేనే సమర్థంగా విధులు



యోగాసనాలలో ఎస్పీ అఖిల్‌మహాజన్



యోగా చేస్తున్న పోలీసులు

- యోగా అలవాటుగా మారాలి
- ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లక్రైం: ఆరోగ్యంగా ఉంటేనే సమర్థంగా విధులు నిర్వర్తిస్తామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. నిత్యం యోగా సాధనతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం యోగా శిక్షణ ఇచ్చారు. నిరంతరం విధులు నిర్వహించే పోలీసులు యోగాను అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై అశ్రద్ధ చూపవద్దన్నారు. పోలీసు దినచర్య, జీవన విధానం మిగతావారితో పోల్చితే భిన్నంగా ఉంటాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక, వ్యాయామం, యోగా దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్‌కే డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహించినట్లు వివరించారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి డయాబెటిస్, కార్డియక్ స్క్రీనింగ్, బ్లడ్ షుగర్ వంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు కుమారస్వామి, రజనీకాంత్, యాదగిరి, సీఐలు అనిల్‌కుమార్, ఉపేందర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో గిద్దెచెరువు కట్టమైసమ్మ, శ్రీదుర్గా మాతా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు వేలేటి ఫణీంద్రశర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి, మమతారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు నంది కిషన్, సద్ది లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట నర్సింహరెడ్డి, ఎల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాల పేరుతో మహిళలకు మోసం



మాట్లాడుతున్న గంగాడి మోహన్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు, యువతను నిరుద్యోగ భృతి పేరిట మోసం చేసిందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటాపూర్‌లో శుక్రవారం ఆ పార్టీ స్ట్రీట్‌కార్నర్ సమావేశం మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రేపటి నుంచి అన్ని శక్తి కేంద్రాలలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. బీఆర్‌ఎస్‌కు బీజేపీ ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. శక్తి కేంద్రాలు బూతులవారీగా ప్రజాసమస్యలపై పోరాడాలని కోరారు. బాలయ్య, కిరణ్, రాజు, రవి, పూర్ణచందర్, శ్రీకాంత్, దేవయ్య, గోపి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

భర్త చిత్రహింసలు భరించలేకనే హత్య



హత్య కేసు నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

- అక్రమ సంబంధంతోనే కుటుంబంలో కలహాలు
- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి
- ఆరుగురి అరెస్ట్ చూపిన పోలీసులు

చందుర్తి(వేములవాడ): అక్రమ సంబంధం నెరుపుతూ నిత్యం భర్త పెడుతున్న చిత్రహింసలు భరించలేకనే భార్య తన కుటుంబ సభ్యులతో కలిసి హత్య చేసిందని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం హత్య నిందితులను అరెస్ట్ చూపి, హత్యకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెల్లడించారు. రుద్రంగి మండలకేంద్రానికి చెందిన రణవేణి గణేశ్‌కు వేములవాడరూరల్ మండలం వట్టెంలకు చెందిన స్వప్నను రెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొద్ది నెలలుగా అక్రమ సంబంధం పెట్టుకుని భార్యను తరచూ చిత్రహింసకు గురిచేసేవాడు. భర్త వేధింపులు భరించలేకనే 20 రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి గణేశ్ భార్య ఆచూకీ కోసం ఆమె తరఫున బంధువుల ఇళ్లలో వెతికాడు. ఈనెల 7న చందుర్తి మండలం నర్సింగాపూర్‌లోని అమ్మమ్మ రేగుల దేవవ్వ ఇంట్లో ఉందని తెలుసుకుని రాత్రి అక్కడికి చేరుకున్నాడు. తన కొడుకును, భార్యను పంపించాలని తలుపులు కొట్టాడు. ఇంట్లో ఉన్న రణవేణి లావణ్య తలుపు తీయగా ఇంటి వెనుక నుంచి ఇంట్లకు వచ్చిన సింగరవేణి బుచ్చవ్వ కంట్లో కారం పొడిని చల్లింది. వెంటనే ఆమె వెంట ఇంట్లోకి వచ్చిన సింగరవేణి హరీశ్, రణవేణి లావణ్య ఆమె భర్త చందర్, ఆమె కుమారుడు శరత్‌చంద్ర, మృతుని భార్య స్వప్నతో కలిసి కత్తి, గొడ్డలితో తల, చేతిపై దాడిచేసి హత్యకు పాల్పడ్డారు. అనంతరం పరారీలో ఉన్న ఆరుగురు నిందితులను వేములవాడ బస్టాండ్‌లో శుక్రవారం చందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య చేసేందుకు వినియోగించిన కత్తి, గొడ్డలిని సింగరవేణి హరీశ్ పొలం వద్ద నుంచి, హరీశ్ వద్ద ఉన్న సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్ డాటా ఆధారంగా మరిన్నీ ఆధారాలు సేకరిస్తామన్నారు. అరెస్టు చేసిన ఆరుగురిని రిమాండ్‌కు పంపించినట్లు డీఎస్పీ నాంగ్రేందచారి తెలిపారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమేశ్ పాల్గొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

- తక్షణ సహాయం కోసం డయల్ 100
- సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్

సిరిసిల్లక్రైం: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్లరూరల్ సర్కిల్ పరిధిలోని ముస్తాబాద్, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల ప్రజలు తమకు ఏదేని సమస్య ఎదురైతే డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ఇటీవల ఓ మండలంలో ఎలాంటి అధికారం లేని వ్యక్తి వాహన డ్రైవర్‌ను బెదిరింపులకు గురిచేసినట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు. అనధికారిక పనులు, వ్యాపారాలు, క్రయవిక్రయాలు జరిగితే సమాచారాన్ని సంబంధిత పోలీసు అధికారులకు తెలపాలని సూచించారు.

మారుమోగిన రాజన్న నామస్మరణ







వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు శుక్రవారం 15 వేల మంది భక్తులు తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాలను సందర్శించారు.

క్లుప్తంగా

కవి బాపురెడ్డికి నివాళి



నివాళులు అర్పిస్తున్న కవులు

సిరిసిల్లకల్చరల్: మాజీ ఐఏఎస్ అధికారి, ప్రముఖ కవి జంకె బాపురెడ్డికి జిల్లా రచయితల సంఘం నివాళులు అర్పించింది. అనారోగ్యంతో బుధవారం కన్నుమూసిన ఆయన అంత్యక్రియలు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. ఈ సందర్భంగా శుక్రవారం పలువురు కవులు అంబేడ్కర్ సర్కిల్‌లో నివాళులు అర్పించారు. బాపురెడ్డి సాహిత్య సేవలను స్మరించుకున్నారు. సమర్థవంతమైన పరిపాలనాధికారిగా ఎన్నో సంస్కరణల చేపట్టిన ఆయన సామాజిక రుగ్మతలపై అక్షరాస్త్రాలు సంధించి సాహిత్యంలోనూ రాణించారని కొనియాడారు. సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, కార్యదర్శి వాసరవేని పరశురాం,ఆడెపు లక్ష్మణ్, వెంగల లక్ష్మణ్, జిందం అశోక్, బూర దేవానందం, అంకారపు రవి పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



రోడ్డు పక్కన పడిపోయిన లారీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారు మూలమలుపు వద్ద గురువారం రాత్రి లారీ అదుపుతప్పి పడిపోయింది. కోడిపెంటను తరలిస్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేవు.

ప్రభుత్వ బడులు.. కార్పొరేట్ వసతులు

- మన ఊరు–మన బడితో సమూల మార్పులు
- మొదటి దశలో 172 పాఠశాలలు ఎంపిక
- సీఎస్సార్ కింద ఆరు మోడల్‌స్కూల్స్
- రూ.45కోట్లతో పనులు
- రెండు పాఠశాలల పనులు పూర్తి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం.. నిరుపేద విద్యార్థులకు నాణ్య మైన విద్య నందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. మన ఊరు–మన బడిలో భాగంగా మొదటిదశలో రాజన్నసిరిసిల్ల జిల్లాలో 172 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుంది. దీంతోపాటు సీఎస్సార్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ)లో భాగంగా మరో ఆరు పాఠశాలలను ఆధునికంగా తీర్చిదిద్దుతున్నారు.



నిర్మాణం పూర్తయిన ఎల్లారెడ్డిపేట హైస్కూల్

ఇప్పటికే రెండు స్కూళ్లు సిద్ధం

జిల్లాలో ఇప్పటికే రెండు స్కూళ్లను సిద్ధం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ పాఠశాలలను అందుబాటులోకి తెచ్చారు. ఇది రాష్ట్రంలోనే తొలి కేజీ టు పీజీ క్యాంపస్. సీఎస్సార్ కింద ఎంపికైన ఒక్కో స్కూల్‌లో రూ.7.50 కోట్లతో ఆధునిక వసతులు కల్పిస్తున్నారు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, వేములవాడ పట్టణాల్లో పనులు జరుగుతున్నాయి. ఈ పాఠశాలలను చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆకర్షితులవుతున్నారు. తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్ల నుంచి తీసుకొచ్చి మరీ చేర్పిస్తున్నారు.

పెద్ద బడికి కొత్తరూపు

ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వందేళ్ల చరిత్ర ఉంది. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే నిజాం కాలంలో ఈ పాఠశాలను నిర్మించారు. కాలక్రమంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ప్రమాదకరంగా మారడంతో ఇంజినీరింగ్ అధికారులు భవనాన్ని పరిశీలించి కూల్చివేయాలని సూచించారు. అయితే ఆ అందమైన బడి ఇక కూలిపోతుందని అనేక మంది పూర్వ విద్యార్థులు ఆందోళన చెందారు. వేల మందికి బతుకుబాట చూపిన ఈ పాఠశాల శిథిలమై కూల్చివేస్తారని తెలిసి పూర్వ విద్యార్థులు తరలివచ్చి ఫొటోలు దిగి ఉద్వేగానికి లోనయ్యారు. వందేళ్ల చరిత్ర గల ఎంతో మందికి నీడనిచ్చిన పాఠశాలను భావితరాల గుర్తించుకునేలా అదే ఆర్కిటెక్చర్ విధానంలో నిర్మిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. గతేడాది ఏప్రిల్‌లో కూల్చివేయగా పాఠశాలను సీఎస్సార్‌ను నిధులు రూ.7.50కోట్లతో పనులు చేస్తున్నారు. ప్రస్తుతం భవన పనులు తుది దశకు చేరాయి. 400 మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేసేలా డైనింగ్‌హాల్ సిద్ధమైంది. 48 కంప్యూటర్ల ద్వారా విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు ల్యాబ్ పనులు పూర్తి చేశారు. ఇలా నిజాం కాలం నాటి బడులను సైతం కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకుపోతోంది.



కంప్యూటర్ ల్యాబ్‌లో పాఠాల బోధన

గివ్ ఫౌండేషన్ పర్యవేక్షణలో..

రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో గివ్ ఫౌండేషన్ తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో సీఎస్సార్ నిధులతో ప్రభుత్వ బడులను ఆధునికీకరిస్తున్నారు. జిల్లాలో మొదటిదశలో ఆరు పాఠశాలలను ఎంపిక చేశారు. ఫౌండేషన్ ఇన్‌చార్జి కొండూరి సాంకేతరావు పర్యవేక్షణలో బడుల ఆధునికీకరణ కొనసాగుతున్నాయి. ముందుగా సిరిసిల్లలోని బాలికల ఉన్నత పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దారు. తర్వాత గంభీరావుపేటలో కేజీ టు పీజీ పాఠశాలను నిర్మించగా.. ఇటీవల రాష్ట్ర మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, వేములవాడ పట్టణాల్లో పనులు కొనసాగుతున్నాయి.

కంప్యూటర్ బోధన



పాత పెద్దబడిని కూల్చివేసి కొత్తగా నిర్మిస్తున్నారు. మా బడిలో 48 కంప్యూటర్ల ద్వారా విద్యా బోధన చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ పాఠశాలలో చదువుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం. మాలాంటి పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందుతుంది.

– అశ్విని, విద్యార్థిని, ఎల్లారెడ్డిపేట

సీఎస్సార్ నిధులతో..



జిల్లాలో గివ్ ఫౌండేషన్ పర్యవేక్షణలో మంత్రి కేటీఆర్ సహకారంతో సీఎస్సార్ నిధులు వెచ్చించి సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నాం. ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకుపోతోంది. ఇప్పటి వరకు జిల్లాలో రూ.45 కోట్లతో పాఠశాల భవన నిర్మాణాలు చేపట్టాం. ఇప్పటికే రెండు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చాం. రానున్న రోజుల్లో మరిన్ని బడులను ఆధునికీకరిస్తాం.

– కొండూరి సాంకేత్‌రావు, గివ్ ఫౌండేషన్ ఇన్‌చార్జి

పాఠశాలల్లో మౌలిక వసతులు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న మన ఊరు–మనబడితో మొదటి దశలో 172 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలలో అన్ని మౌలిక వసతులతో కూడిన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దీనికితోడు సీఎస్సార్ నిధులతో మంత్రి కేటీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించి కార్పొరేట్ స్థాయిలో బడులను బలోపేతం చేస్తున్నారు. ఈ అవకాశాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు

మల్లాపూర్(కోరుట్ల): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్ హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దుర్భాషలాడిన హమారా ప్రసాద్‌పై స్థానిక ఠాణాలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మహేశ్ మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదన్నారు. నాయకులు ఎల్కా కమలాకర్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, మగ్గిడి సంతోష్, అరిగడ్డి పెద్దులు, జంగం దినేశ్, కోరుట్ల నరేశ్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై మైనర్ బాలుడి మృతి



లవన్ కుమార్ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): చిన్నతనంలోనే మద్యానికి బానిసైన మైనర్ బాలుడు అర్ధంతరంగా తనువు చాలించిన ఘటన తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూం సముదాయంలో శుక్రవారం విషాదం నింపింది. తంగళ్లపల్లి పోలీసులు, బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండలంలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో నివసించే వేముల కవిత భర్త సదానందం నాలుగేళ్ల క్రితం అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కవితకు ఒక కొడుకు లవన్‌కుమార్(16), కూతురు ఉన్నారు. లవన్‌కుమార్ సిరిసిల్లలోని గీతానగర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గత ఆరు నెలలుగా మద్యానికి బానిసైన లవన్‌కుమార్‌ను తల్లి కవిత మందలించినప్పటికీ తీరుమార్చుకోలేదు. మద్యం తాగుతూ చెడు అలవాట్లకు బానిసై ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అరగంట తరువాత తిరిగొచ్చి వాంతులు చేసుకుంటూ స్పృహ కోల్పోయాడు. వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశాడు. తన కొడుకు తాగుడుకు, చెడు అలవాట్లకు బానిసై ఆరోగ్యం పాడుచేసుకుని చనిపోయాడని తల్లి కవిత ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువరైతు ఆత్మహత్య



రాజు(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన రైతు బట్టు రాజు(30) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు. గూడెం గ్రామానికి చెందిన రాజు తనకున్న ఎకరం వ్యవసాయ భూమిలో వరి సాగుచేస్తున్నాడు. కుటుంబ పోషణకు అప్పులు చేసిన రాజు.. వాటిని చెల్లించేందుకు ఇబ్బందులు పడ్డాడు. రూ.5లక్షల వరకు అప్పులు ఉండగా, ఇటీవల పది గుంటల భూమిని సైతం విక్రయించాడు. అయిన అప్పులు తీరకపోవడంతో.. తీవ్ర మనస్థాపానికి గురై పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య రమ్య, కుమార్తె మనోజ్ఞ, కుమారుడు యశ్వంత్ ఉన్నారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బైక్ దొంగకు ఆరునెలల జైలు

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం ఎదుట నిలిపిన బైక్‌ను దొంగలించిన వ్యక్తికి ఆరు నెలల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి సౌజన్య తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాలు. గతేడాది సెప్టెంబర్ 5న కుమ్మం ప్రశాంత్ తన అవసరాల నిమిత్తం సిరిసిల్లకు వచ్చిన తన బైక్‌ను వినాయక ఫర్టిలైజర్ షాప్ ముందు పార్కింగ్ చేశాడు. పని ముగించుకుని వచ్చి చూసేసరికి బైక్‌లేదు. తన బైక్ పోయిందని బాధితుడు సిరిసిల్లటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు తెలుసుకుని బైక్ దొంగతనం చేసింది ఇల్లంతకుంట మండలం దురుముట్ల నరేశ్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. సాక్ష్యాలను కోర్టులో నిరూపించడంతో నరేశ్‌కు ఆరు నెలల కఠిన కారాగార శిక్ష వేయడంతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ శుక్రవారం న్యాయమూర్తి తీర్పు నిచ్చినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం



యువకుడిని నిలదీస్తున్న స్థానికులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌లో శుక్రవారం ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో ఉన్న ఆ యువకుడు ఇంట్లో ఎవరూలేని సమయంలో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి ప్రయత్నించాడు. అలాగే అడ్డుకోబోయిన స్థానికులపై రెచ్చిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మద్యం మత్తులో ఉన్న యువకున్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే, నిందితుడు వారికి పొంతనలేని సమాధానాలు చెప్పాడు.

నృసింహుని బ్రహ్మోత్సవాలపై సమీక్ష

ధర్మపురి: త్వరలో నిర్వహించే ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలపై మున్సిపల్ అధికారులు, పాలకవర్గం సమీక్షించింది. శుక్రవారం కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షత వహించారు. జాతరలో చేపట్టే 18 అంశాలు, పనులు, ఏర్పాట్లకు ఆమోదం తెలిపారు. డివైడర్ల మధ్య మొక్కలు నాటడం, పైపులైన్ల లీకేజీ సామగ్రి కొనుగోలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, స్టేషనరీ సమకూర్చుకోవడం తదితర అంశాలను ఆమోదించారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ రామన్న, మున్సిపల్ కమిషనర్ రమేశ్, మేనేజర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ట్రైనింగ్ సెంటర్‌కు ఎంపిక



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పదో తరగతి చదివిన నీలం పర్శరాములు గోవా ఆర్మీ ట్రైనింగ్ సెంటర్‌కు ఎంపికయ్యాడు. పర్శరాములును శుక్రవారం స్కూల్ కరస్పాండెంట్ ఎండీ లతీఫ్, ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. తమ ఏకైక కుమారుడు ఆర్మీకి ఎంపికవడం గర్వంగా ఉందని నీలం రవి–కవిత దంపతులు పేర్కొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని కోరుట్లపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కోరుట్ల పేట ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడెంటిటీకార్డులు, టై, బెల్టులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొండే రామిరెడ్డి, జనరల్ సెక్రెటరీ కొప్పు లక్ష్మణ్, ఉపాధ్యాయులు స్వామి, కృష్ణహరి, రాములు, నారాయణ, రమేశ్, నర్సయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.25లక్షల పరిహారం ప్రకటించండి

- ఎంపీ అర్వింద్

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతు గడ్డం జలపతిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ప్రకటించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. ఇటీవల తన ఇద్దరు కూతుళ్లతో కలిసి ఆత్మహత్య చేసుకున్న జలపతిరెడ్డి కుటుంబాన్ని ఆయన శుక్రవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జలపతిరెడ్డి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయస్థానం నుంచి భూ పరిహారం ఇప్పించేందుకు బీజేపీ న్యాయ సాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి, వరుణ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అంతర్గాం గ్రామానికి చెందిన బీజేపీ బూత్ కమిటీ ఉపాధ్యక్షుడు బొంతల గంగాధర్ కుటుంబ సభ్యులకు అర్వింద్ రూ.లక్ష సాయం అందజేశారు.

శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

జగిత్యాలరూరల్: హబ్సీపూర్‌లో ఇటీవల నిర్మించిన శివాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధిక, జెడ్పీ సీఈవో రామానుజం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సందీప్‌రావు, రాజేశ్వర్ రెడ్డి, ఎల్లారెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

రానున్నది బీజేపీ పాలన



చేనేతన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న లగిశెట్టి శ్రీనివాస్

- సెస్ మాజీ వైస్‌చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్
- రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిక
- సిరిసిల్ల నుంచి తరలివెళ్లిన వందలాది మద్దతుదారులు



సిరిసిల్ల నుంచి వెళ్తున్న బీజేపీ శ్రేణులు

సిరిసిల్లటౌన్: జనరంజక పాలన బీజేపీతోనే సాధ్యమని రాబోవు ఎన్నికల్లో పార్టీ పగ్గాలు చేపడుతుందని సెస్ మాజీ వైస్‌చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉదయం సిరిసిల్లలో వందలాది మంది కార్యకర్తలతో ర్యాలీ తీశారు. చేనేతన్న విగ్రహానికి పూలమాల వేసి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, సిరిసిల్ల అసెంబ్లీ పాలక్ రాణిరుద్రమ, జిల్లా ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శీలం రాజు, అన్నల్‌దాస్ వేణు, గౌడ వాసు, రాజాసింగ్, ఆనందబాబు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలి



కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

- పెండింగ్ కేసులలో పురోగతి సాధించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి(వేములవాడ): శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని గదులతోపాటు పరిసర ప్రాంతాలను, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులలో పురోగతి సాధించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకోవాలన్నారు. గ్రామాల్లో ఏమి జరగుతుందో ఎప్పటికప్పుడు సేకరించేందుకు వీపీవోలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. ప్రజలతో సంబంధాలను పెంచుకోవాలని సిబ్బందికి సూచించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై రమాకాంత్ ఉన్నారు.

ఈ కలపకు అనుమతులు ఉన్నాయా..?



నూకలమర్రిలో ఒకేచోట వేసిన దుంగలు

వేములవాడరూరల్: గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది వ్యాపారులు చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వేములవాడ మండలంలోని నూకలమర్రి తదితర గ్రామాల్లో రైతుల చెట్లను కొనుగోలు చేసి ఫారెస్టు అధికారులకు తెలియకుండానే చెట్లను నరికేస్తూ సిద్దిపేట, కామారెడ్డి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామాల్లో పలువురు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం ఎలాంటి అనుమతి లేకుండా చెట్లను తొలగించొద్దని నిబంధనలు ఉన్నప్పటికీ కొంతమంది వ్యాపారులు ఈ ప్రాంతంలో చెట్లను నరికేస్తూ రాత్రి సమయంలో దుంగలను తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రైతుల పేరుపై ఈ కలపను ఇతర ప్రాంతాలకు సదరు కాంట్రాక్టర్లు తరలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో తనిఖీలు చేపట్టి సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎఫ్ఆర్‌వోను వివరణ కోరగా కొంతమంది వ్యాపారులు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకుని చెట్లను నరికేస్తున్నారని నూకలమర్రిలో ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.